









‘మట్టి’మేలు తలపెట్టవోయ్

● సిద్ధమవుతున్న వినాయక విగ్రహాలు







రంగులు, రసాయనాలతో తయారు చేసిన వినాయక విగ్రహాలతో పర్యావరణానికి చేటు కలుగుతోంది. ముఖ్యంగా నిమజ్జన వేళ జల కాలుష్యం ఫలితంగా జీవరాశులు హరించుకుపోతున్నాయి. దీంతో మట్టి ప్రతిమలతోనే పూజలు చేయాలనే సంకల్పం ఏటేటా పెరుగుతోంది. ఇట్టే నీటిలో కరిగిపోయే మట్టి విగ్రహాలనే వినియోగించాలని పర్యావరణ హితేషులు కూడా తమవంతుగా ప్రచారం కల్పిస్తున్నారు. ఈక్రమంలోనే వినాయక చవితి సందర్భంగా జిల్లాలో పలు చోట్ల మట్టి విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. చిత్తూరుకు చెందిన తిరువేలన్ కూడా బంకమట్టి, వరి పొట్టు, రంపపు పొట్టు, తదితరాలతో బొజ్జ గణపయ్య విగ్రహాలను బెంగాల్‌కు చెందిన కళాకారులతో తయారు చేయిస్తున్నాడు. వీరు సిద్ధం చేసిన విగ్రహాలు సప్తకన్నికల ఆలయం సమీపంలో 4 నుంచి 15 అడుగుల ఎత్తుతో సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

- చిత్తూరు కల్చరల్, ఆంధ్రజ్యోతి

డిగ్రీ కళాశాలల్లో నేటినుంచి అడ్మిషన్లు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల్లో సోమవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభించడానికి ఏపీ ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు జిల్లా నోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ కోర్సులు ఉన్నాయని వివరించారు. సందేహాల నివృత్తి కోసం బీఏ (94943 68020), బీకాం (98499 59423), బీఎస్సీ (99851 65051) నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కలెక్టరేట్‌లో నేడు ‘పీజీఆర్ఎస్’

చిత్తూరు అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామన్నారు. డివిజన్, మండల స్థాయిల్లోనూ అధికారులు పీజీఆర్ఎస్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ● జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘జీఐఎస్’ మాటేమిటి?

నష్టపోతున్న ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన గ్రూపు ఇన్సూరెన్స్ స్కీమ్ (జీఐఎస్)ను ఏడాదిగా పట్టించుకునేవారు కరువయ్యారు. దీనివల్ల ఉద్యోగులు నష్టపోతున్నారు. 2025 జనవరి 3వ తేదీన జారీ చేసిన జీవో నెంబరు ఒకటి ప్రకారం ఈ స్కీమ్ 2024 జూన్ 30వ తేదీవరకు మాత్రమే వర్తిస్తుంది. 2024 జూలై ఒకటో తేదీనుంచి కొనసాగిస్తూ ప్రభుత్వం ఇంతవరకు మరో ఉత్తర్వును జారీ చేయలేదు. దీనివల్ల ఉమ్మడి జిల్లాలో సుమారు 25వేల మంది ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ప్రీమియం కట్టించుకునేదిలా..

నాల్గవ తరగతి ఉద్యోగులకు నెలవేతనంలో రూ.15, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లకు రూ.30, సూపరింటెండెంట్లు, ఫస్ట్‌గ్రేడ్ అధికారులకు రూ.60, జిల్లా అధికారులు, ఆపై స్థాయి అధికారుల వేతనంలో రూ.120 చొప్పున జీఐఎస్ ప్రీమియం కింద ప్రభుత్వం మినహాయిస్తుంది. సర్వీసులో ఉంటూ మరణిస్తే వారి స్లాబులకు అనుగుణంగా పది రెట్ల బీమా సొమ్ము, అప్పటివరకు ఉద్యోగులు పొదుపు చేసిన నగదును కలిపి ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ మొత్తం బాధిత కుటుంబాలకు చేయూతగా నిలుస్తుంది.



ప్రభుత్వం వెంటనే జీవో ఇవ్వాలి



ప్రభుత్వ వెంటనే జీఐఎస్‌ను కొనసాగింపుపై జీవోను వెంటనే ఇవ్వాలి. అప్పుడే బాధిత కుటుంబాలకు మేలు జరుగుతుంది. ఇప్పటికే చాలా కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి.

- డి.నరేష్‌బాబు, ఉపాధ్యక్షుడు, ఏపీ ట్రెజరీస్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్, అమరావతి

మాటిచ్చాం.. చేసి చూపాం..!

పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు చెప్పిన హామీలను ఏడాదిలోపే చేసి చూపామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ‘అన్నదాత సుఖీభవ’ నిధులు తమ బ్యాంకు ఖాతాల్లో జమైనందుకు కృతజ్ఞతగా పలమనేరులో ఆదివారం నియోజకవర్గంలోని రైతులు భారీగా ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ యార్డులో జరిగిన రైతు సంబరాల సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. పలమనేరులో రైతుల కోసం 33 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు సదుపాయాన్ని కల్పించామన్నారు. నేడు 2వేల కోట్లతో హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. సీనియర్ నాయకులు ఆర్‌వీ బాలాజి, రామచంద్రనాయుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు రంగనాథ్, కిషోర్ గౌడు, సోమశేఖర్‌గౌడు, ఆనంద, నాగరాజరెడ్డి, ఆర్బీసీ కుట్టి, బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్, జనసేన నాయకుడు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.




సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, హాజరైన రైతులు, టీడీపీ నాయకులు

కార్వేటినగరంలో కోలాహలంగా ఉట్లోత్సవం

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

వివరాలు 7లో

తేనెటీగల దాడిలో 47 మందికి గాయాలు

గుడిపాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో 47 మంది గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గుడిపాల మండలంలోని బసవాపల్లె గ్రామ సమీపంలో ఉన్న మునేశ్వరుడికి మొక్కులు తీర్చుకోవడానికి ఓ కుటుంబం పూజలకు ఆదివారం ఏర్పాట్లు చేసింది. బంధుమిత్రులు తరలివచ్చారు. పూజల్లో భాగంగా స్వామికి నైవేద్యం సమర్పించడానికి పొంగళ్లు పెడుతుండగా పొగ వ్యాపించింది. ఈ పొగ కారణంగా సమీపంలోని తేనెటీగలు ఒక్కసారిగా అక్కడున్న చిన్నాపెద్దపై దాడి చేశాయి. 47 మందికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన నాగరాజును చికిత్స నిమిత్తం 190 రామాపురం సీఎంసీకి తరలించారు. మిగిలినవారిని గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 108 అంబులెన్స్ ద్వారా తరలించారు. అనంతరం గ్రామంలో వైద్యాధికారి సంధ్య ఆదేశాలతో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. బాధితులకు వైద్య సేవలు అందించారు.



గాయపడిన బసవాపల్లె గ్రామస్తులు




కల్లూరు ఘాట్ సమీపంలోని అడవిలో ఏనుగుల గుంపు - విరిచేసిన మామిడి చెట్టు కొమ్మలు

‘మామిడి’పై గజదాడి

● కల్లూరు ఘాట్ సమీపంలో ఏనుగుల గుంపు

కల్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపు రెండ్రోజులుగా అడవిలో తిష్ఠ వేశాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని దేవరకోన, మేఘాలకోనలో సంచరిస్తున్న ఏనుగులు శనివారం రాత్రి దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లె వద్దకు వచ్చాయి. గ్రామంలోని మురళికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. అక్కడి నుంచి పాళెం పంచాయతీ జూపల్లె వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని నాగరాజు, లలితమ్మ, రామయ్య, రాజమ్మలకు చెందిన మామిడి చెట్లను విరిచేశాయి. కోటపల్లెలోని వెంకట్రమణ, సుబ్రహ్మణ్యంకు చెందిన మామిడిచెట్లను కూడా విరిచేసి, అక్కడినుంచి అటవీ ప్రాంతంలోని బోదబండ వద్దకు చేరుకున్నాయి. కాగా, కల్లూరు ఘాట్ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఏనుగుల గుంపు హల్‌చల్ చేశాయి. ఇది తెలుసుకున్న కల్లూరు పట్టణంలోని పలువురు యువకులు, హైవేపై వెళుతున్న ప్రజలు ఏనుగులను చూడటానికి అడవిలోకి వెళ్లారు. ఈ సందర్భంగా యువకుల అరుపులకు ఏనుగుల గుంపు ఘీంకారం చేసింది.

భక్తజనసంద్రం.. రాజనాలబండ

● వైభవంగా ఉట్లోత్సవం



ఉట్లు కొడుతున్న యువకులు




పాకుమాను పాకుతున్న యువకులు, వీక్షిస్తున్న భక్తులు

చౌడేపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ తిరునాళ్లలో భాగంగా ఉట్లోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. కొండపై స్వయంభువుగా వెలసిన లక్ష్మీనరసింహస్వామి, క్షేత్ర పాలకుడైన అంజనేయస్వామికి ఉదయాన్నే అర్చకులు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కొలింపల్లెలోని బోయకొండ గంగమ్మ ఉత్సవమూర్తి, ఊటూరు, దాసరయ్యగారిపల్లె, పెద్దూరు దేవరెద్దులను ఎగువ, దిగువ గాజులవారిపల్లె, మర్రిమాకులపల్లె, పెద్దూరు, కొత్త గూబలవారిపల్లె, వెంగళపల్లె, కొలింపల్లె, ఊటూరు, కొండామాని గ్రామాల పురవీధుల్లో చెక్కభజనలు, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగిస్తూ రాజనాలబండకు తీసుకొచ్చారు. ఆలయం ముందున్న నాలుగు కాళ్ల మండపం వద్ద అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఆలయం ముందు 50 అడుగుల ఎత్తయిన పాకుమానుకు ఆముదం, ఆవాలు, కలబంద గుజ్జు తదితర లేపనాలు పూసి చివరిభాగంలో స్వామివారి ప్రసాదం ఏర్పాటు చేశారు. చౌడేపల్లె మండలంలోని మల్లెలవారిపల్లె, మర్రిమాకులపల్లె, గాజులవారిపల్లె, పెద్దూరు, వెంగళపల్లె, కొలింపల్లెకు చెందిన పాపుగాని వంశానికి చెందిన వారసులు పాకుమాను పాకడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో పెద్దూరుకు చెందిన యువకులు పాకుమానును పాకి స్వామివారి ప్రసాదం దక్కించుకున్నారు. చిప్పలివారిపల్లె, మల్లెలవారిపల్లె, మోట్లపల్లె గ్రామానికి చెందిన యువకులు ఉట్టి కొట్టి స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో రాజనాలబండ భక్తజనసంద్రమైంది. గంటల తరబడి క్యూలైన్లలో భక్తులు వేచి ఉంచి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో ఏబీఎన్ చౌదరి, సూపరింటెండెంట్ నాగేంద్రప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు భానుప్రకాష్, ధనంజయరావు, టీటీడీ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి







ఎడతెగని రద్దీ.. చిటపటమని కురుస్తూనే ఉన్న వాన.. వణికిస్తున్న చలి.. తిరుమలలో, తిరుపతిలో ఆదివారం చిత్రమైన వాతావరణం నెలకొంది. అలిపిరి కొండలమీద పచ్చని చెట్లతో ముచ్చట్లాడుతున్నట్టుగా తెల్లని మబ్బులు వాలి కనువిందు చేశాయి. టోల్‌గేట్‌లో బారులు తీరిన వాహనాలు భక్తులను ఇక్కట్లపాలు చేశాయి. తిరుమల కొండమీదా వరుస సెలవుల మూడో రోజున కూడా ఎటు చూసినా భక్తజనమే కిటకిటలాడుతూ కనిపించారు. కిలోమీటర్ల దూరం సర్వదర్శనం భక్తులు క్యూలైన్లలో నిలబడ్డారు. గదులు దొరక్క తలతడవని తావుల్లో సర్దుకుని కూర్చున్నారు. ఆలయం ముందు చలికి వణుకుతూ తిరుగుతూ కనిపించారు.

- ఆంధ్రజ్యోతి, తిరుమల, తిరుపతి



కోలాహలంగా ఉట్లోత్సవం

కార్వేటినగరం వేణుగోపాల స్వామి ఆలయం వద్ద భక్తిశ్రద్ధలతో గోపూజ


ఉట్టి కొడుతున్న భక్తుడు

వెదురుకుప్పం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం ఉట్లోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు పూర్తి చేశారు. మూలవర్లకు స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా జరిగింది. యాదవ కులస్తుల ఆధ్వర్యంలో ఉట్లోత్సవం జరగ్గా, టీటీడీ ఆధ్వర్యంలో గోపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వర్షం కారణంగా తిరువీధి ఉత్సవం రద్దయ్యింది. ఏఈవో రవికుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు సురేష్ బాబు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆలయం నుంచి వెలుపలకు వస్తున్న ఉత్సవర్లు

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ

చౌడేపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. వేకువజామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వర్ణాభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.


ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ

వైభవంగా వ్యాస పూజ

తిరుపతి ఇస్కాన్‌లో ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు


భక్తివేదాంతస్వామి ప్రభుపాద ప్రతిమకు అభిషేకం చేస్తున్న అర్చకులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : తిరుపతి ఇస్కాన్ టెంపుల్‌లో మూడు రోజులపాటు జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆదివారం నాటి వ్యాసపూజతో ముగిశాయి. ఆలయంలో అష్టసఖి సమేత శ్రీకృష్ణుడికి ఉదయం మంగళహారతినిచ్చి భక్తులకు దర్శనం కల్పించారు. తర్వాత దర్శన హారతి అత్యంత వేడుకగా నిర్వహించారు. భక్తివేదాంత స్వామి మందిరంలో ఇస్కాన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసపూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. వ్యవస్థాపకులు భక్తివేదాంత స్వామి ప్రభుపాద ప్రతిమకు పాలు, పెరుగు, తేనె వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. పుష్పాభిషేకం నిర్వహించారు. నైవేద్యాలను సమర్పించారు. అభిషేకాలు సాగినంత సేపు భక్తుల హరేరామ హరేకృష్ణ నామస్మరణ ధ్వనించింది. భక్తివేదాంత స్వామి జీవితం, మహిమాన్విత కృషిపై పలువురు ప్రసంగించారు. వినాయకనగర్ మైదానంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖలు సంయుక్తంగా తిరుపతిలో నిర్వహిస్తున్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషియన్‌లో 2025-26 సంవత్సరానికి వివిధ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ టూరిజం అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆమ్రపాలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

- బీఎస్సీ (హెచ్ అండ్ హెచ్.ఏ) 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40శాతం పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులు.
- క్రాఫ్ట్ కోర్సు ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పేటిస్సెరి, సర్టిఫికెట్ కోర్సు ఇన్‌ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సులకు పదో తరగతి పాసైన వారు అర్హులు.

ఈ కోర్సులకు వయో పరిమితి లేదు. కోర్సు పూర్తి చేసిన తర్వాత ఏపీ పర్యాటక శాఖ హోటళ్లు, ప్రముఖ హోటళ్లలో ఉద్యోగావకాశం కల్పిస్తారు. యువతీ యువకులకు వేర్వేరుగా వసతి సౌకర్యం ఉంటుంది. ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. 'ఎస్ఐహెచ్ఎంటీపీటీ.ఓఆర్‌జీ'ని సంప్రదించాలి. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 97013 43846, 91005 58006, 97004 40604 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముక్కంటి సేవలో గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

మర్రినే కప్పేసింది



మర్రిచెట్టు కింద మరే మొలకా మొలవదని అంటారు. కింద అయితే మొలవదు కానీ, మరి పైన...? అందుకేనేమో ఈ గురివింద తీగ ఏకంగా మర్రి చెట్టులోనే మొలిచి అల్లుకుంటూ అల్లుకుంటూ మొత్తం వృక్షాన్నే ఇలా కప్పేసింది. తెల్లటి పూతతో.. కశ్మీర్‌లో మంచురాలిన వృక్షంలా కనిపిస్తోంది. తిరుపతి జిల్లాలోని కోట పట్టణంలో శ్యామసుందరపురానికి వెళ్లే దారిలో ఈ శ్వేత సౌందర్యం కనువిందు చేస్తోంది.

- కోట, ఆంధ్రజ్యోతి

ఎస్ఎస్‌డీ టిక్కెట్ల కోసం పడిగాపులు

విష్ణునివాసం వద్ద జోరువానలో తడుస్తూ భక్తుల అవస్థలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలేశుడి దర్శనం కోసం వచ్చే భక్తుల రద్దీ కొనసాగుతోంది. విష్ణునివాసం వద్ద సర్వదర్శనం టిక్కెట్ల కోసం క్యూలలో పడిగాపులు కాశారు. వర్షం పడుతున్నా లెక్క చేయకుండా బారులు తీరారు. సాధారణంగా రోజువారి కోటా ప్రకారం 21వేల టిక్కెట్లు జారీ చేయాల్సి ఉండగా తిరుమలలో కొనసాగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని 15వేలకు ఆ సంఖ్యను కుదించినట్లు ఇక్కడి సిబ్బంది తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి టిక్కెట్ల జారీ చేపట్టారు. దీనికి రెండు మూడు గంటల ముందు నుంచే క్యూలైన్లలోకి చేరుకున్నారు. క్యూలైన్లలో పైకప్పులు లేకపోవడంతో వర్షంలో తడుస్తూ ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొంతమంది గొడుగులు అడ్డుపెట్టుకోగా మరికొందరు టోపీలు, కర్చీఫ్, తువాలును తలకు పెట్టుకున్నారు. అయినా జోరువానకు తడిసి ముద్దయ్యారు. క్యూలైన్ల వద్ద పైకప్పులు అమర్చకపోవడం వల్ల అటు ఎండ వేడిమికి తల్లడిల్లుతూ ఇటు వర్షానికి తడుస్తూ భక్తులు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా టీటీడీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.


వర్షంలో తడుస్తూ క్యూలో వేచి ఉన్న భక్తులు

అక్కా.. నే చనిపోవాలనుకుంటున్నా!

ఐదు రోజుల కిందట ఫోను చేసిన మనోజ్ ● ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు సోదరి ఫిర్యాదు

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'అక్కా, నేను తిరుపతి బస్టాండు వద్ద ఉన్నా. నా వల్ల మీరు అప్పుల పాలయ్యారు. అందుకని నేను చనిపోవాలనుకుంటున్నా' అని ఈనెల 12వ తేది ఉదయం 6.30 గంటలకు ఎం.మనోజ్ కుమార్ ఫోను చేశారు. ఆ తర్వాత ఫోను స్విచ్ ఆఫ్ అయింది. అప్పట్నుంచి వెదికినా ఆచూకీ లేకపోవడంతో ఆదివారం తిరుపతి పోలీసులకు నాగపావని ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎం.మనోజ్‌కుమార్‌ది అనంతపురం జిల్లాలోని మండల కేంద్రమైన పామిడి గ్రామం. ఇంటి వద్దే ఉంటున్నారు. షేర్ మార్కెట్లో డబ్బులు పెట్టుబడి పెట్టి నష్టపోయారు. ఈనెల పదో తేది ఉదయం 9 గంటలకు ఫోనుచేసి రైలులో తిరుపతికి వెళ్తొస్తానని బయలుదేరి వెళ్లారు. అక్కడ నుంచి తిరుమల కొండకి వెళ్లి శ్రీవారిని దర్శనం చేసుకుని తిరుపతికి వచ్చారు. 12వ తేది ఉదయం 6.30 గంటలకు కళ్యాణదుర్గం మండలంలోని సోదరి నాగపావనికి ఫోనుచేసి చనిపోవాలనుకుంటున్నానని చెప్పి స్విచ్ ఆఫ్ చేయడంతో ఆందోళన చెందారు. 'మేమంతా తిరుపతికి వచ్చి పరిసర ప్రాంతాల్లో వెదికాం. ఎక్కడా మా తమ్ముడి ఆచూకీ తెలియరాలేదు. మా స్నేహితులు, బంధువులకు చెప్పి వెతకాలని చెప్పాం. ఎంతకీ ఆచూకీ తెలియరాలేదు' అంటూ నాగపావని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.


మనోజ్‌కుమార్

తాగుడు తీసుకొచ్చిన తిప్పలు

మద్యం తాగి అలిపిరికి చేరుకున్న తండ్రి ● తనిఖీల్లో బస్సు ఎక్కకుండా అడ్డుకున్న భద్రతాసిబ్బంది ● ఈలోపే బస్సులో నిద్రిస్తూ తిరుమల చేరుకున్న చిన్నారి ● చివరకు తల్లికి అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది

తిరుమల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బస్సులో నిద్రపోతూ తిరుమల చేరుకున్న ఏడాది పాపను ఆర్టీసీ సిబ్బంది గుర్తించి తల్లికి అప్పగించారు. ఆర్టీసీ అధికారులు తెలిపిన మేరకు.. గూడూరుకు చెందిన వీరయ్య, జ్యోతి తిరుమలలో హాకర్లుగా ఉంటున్నారు. వీరికి ఏడాది వయసున్న కుమార్తె హారిక ఉంది. ఆదివారం ఉదయం ముగ్గురూ తిరుపతికి వెళ్లి సాయంత్రం తిరుమలకు బయలుదేరారు. ఆరు గంటల సమయంలో అలిపిరి చెక్‌పాయింట్ వద్ద.. నిద్రిస్తున్న కుమార్తెను బస్సులోనే ఉంచి వీరు తనిఖీ కోసం కిందకు దిగారు. వీరయ్య మద్యం తాగినట్లు భద్రతా సిబ్బంది గుర్తించి తిరుమలకు వెళ్లేందుకు అడ్డుకున్నారు. ఈ తతంగం జరిగేలోపే బస్సు బయలుదేరి వెళ్లిపోయింది. కొంతసేపటి తర్వాత తల్లి జ్యోతి పాపకోసం బస్సు దగ్గరకు రాగా, తిరుమలకు వెళ్లిపోయినట్టు సమాచారమిచ్చారు. తమ కుమార్తె బస్సులో ఉందని, తమకు అప్పగించాలని భద్రతాసిబ్బందిని ఆమె ప్రాధేయపడ్డారు. దీంతో అలిపిరి సిబ్బంది తిరుమల ఆర్టీసీ అధికారులను సంప్రదించారు. జ్యోతి దంపతుల వద్దనున్న టికెట్ల నెంబర్లు, సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా బస్సును గుర్తించారు. తిరుమల రాంభగీచ ఆర్టీసీ కంట్రోలర్ షైఖేల్ ఆ బస్సును పరిశీలించగా పాప నిద్రిస్తుండటాన్ని గమనించి తన సంరక్షణలోకి తీసుకున్నారు. వెంటనే సమాచారాన్ని అలిపిరి సిబ్బందికి తెలియజేయడంతో జ్యోతి తిరుమలకు చేరుకోగా చిన్నారిని ఆమెకు అప్పగించారు.



జ్యోతికి హారికను అప్పగిస్తున్న కంట్రోలర్ - బస్సులో నిద్రిస్తున్న చిన్నారి హారిక

భక్తజనసంద్రం ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరా లయం ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. వారాంతపు సెలవులు వరుస సెలవులుకావడంతో కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 26వేలమంది భక్తులు దర్శించు కున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేపట్టారు.



తిరుచానూరులో ఉట్లోత్సవం


ఉట్టి కొడుతున్న టీటీడీ ఉద్యోగులు, అర్చకులు,యువకులు

తిరుచానూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం ఉత్సాహభరిత వాతావరణంలో ఉట్లోత్సవం జరిగింది. అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీకృష్ణస్వామి ఆలయంలో అర్చకులు గోకులాష్టమిని పురస్కరించుకుని విశేషాధిపూజాకార్యక్రమాలు నిర్వహించారు. రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామిని బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి వాహనం మండపంలో వేంచేపు చేశారు. అమ్మవారి ఆలయం ఎదుట టీటీడీ ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది ఉట్లోత్సవంలో పాల్గొన్నారు. యువత ఉత్సాహంతో ఉట్టి కొట్టారు. అనంతరం ఆస్థానంతో గోకులాష్టమి వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోహరీందర్‌నాథ్, శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్ రమేష్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేకాలంకారంలో రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు

18 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 18 మండలాల్లో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. మండలాల వారీగా.. పెనుమూరు, గుడుపల్లెలో 26, ఎస్ఆర్‌పురంలో 14.2, రొంపిచెర్లలో 11.2, కుప్పంలో 9, రామకుప్పంలో 8.8, సోమలలో 8.4, నింద్రలో 8.2, పులిచెర్లలో 8, కార్వేటినగరంలో 7.3, విజయపురంలో 6.2, పూతలపట్టులో 5.6, వెదురుకుప్పంలో 5.4, ఐరాలలో 5, సదుంలో 4.8, నగరిలో 4.6, బైరెడ్డిపల్లెలో 1.4, వి.కోటలో ఒక మి.మీ. వర్షపాతం నమోదైంది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

మహిళలపై ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యం

● మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

రామకుప్పం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళలపై ఆర్థికభారం తగ్గించడమే కాకుండా వారిలో ఆత్మస్థైర్యం పెంచుతోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన రామకుప్పంలో మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (స్త్రీ శక్తి) పథకంతో రాష్ట్రంలోని ప్రతి మహిళకు సంతోషాన్నిచ్చిందన్నారు. మహిళలతో పాటు ఈ పథకం విద్యార్థినులకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ఇప్పటి వరకు విద్యార్థినులు బస్‌పాస్‌ల కోసం ఆర్టీసీ డిపోల్లోని బస్‌పాస్ కౌంటర్ల వద్ద పడిగాపులు కాయాల్సివచ్చిందన్నారు. ఇకపై వారికి ఆ బాధలు తప్పిందని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు అందించి ఆసరాగా నిలవగా.. ప్రస్తుతం స్త్రీశక్తి పథకం మరో వరమని అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధికి హద్దులేదని, సంక్షేమానికి తిరుగు లేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం సాధిస్తున్న విజయాలతో తమ ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని వైసీపీ భయపడుతోందన్నారు. ఆ భయంతోనే రాష్ట్ర ప్రభుత్వంపై గ్లోబెల్ ప్రచారానికి పాల్పడుతోందని ఆయన ధ్వజమెత్తారు. సమావేశంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, ఏఎంసీ మాజీ చైర్మన్ సీతాపతి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు మహ్మద్‌రఫీ, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, నేతలు రామ్మూర్తి, కామరాజనాయక్, జయశంకర్, నాగభూషణం, రామకృష్ణప్ప, రామలింగారెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

పీఎంకే ఉడా చైర్మన్ సురేష్‌బాబుకు సన్మానం



కుప్పంలో సురేష్‌బాబును సన్మానిస్తున్న వి.కోట నాయకులు

వి.కోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరు, మదనపల్లె, కుప్పం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఎంపికైన సురేష్‌బాబును కుప్పంలో వి.కోట టీడీపీ నేతలు కలిసి ఆయన్ను సన్మానించారు. ఆదివారం రాత్రి కుప్పం చేరుకున్న నేతలు ఆయన్ను కలిసి గజమాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, మాజీ జడ్పీటీసీ విశ్వనాథ్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు నాగరాజు, మండల రైతు అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, నాయకులు నాగరాజ్, మురుగేష్, విశ్వేశ్వరావ్, వెంకటరమణ, చందు తదితరులు పాల్గొన్నారు.

'జనసేన జెండాల ఆవిష్కరణ' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జనసేన నాయకులు

పుంగనూరు రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో సోమవారం జరిగే జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని జనసేన నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం పుంగనూరులో వారు విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు సోమలలో జనసేన జెండా ఆవిష్కరణ, 10 గంటలకు చౌడేపల్లె, మధ్యాహ్నం 12 గంటలకు పుంగనూరు తూర్పుమొగసాలలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మదనపల్లె రోడ్డులోని శ్రీరస్తు ఫంక్షన్‌హాల్‌లో జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరుగుతుందని, నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పుంగనూరు సింగల్‌విండో చైర్మన్ పగడాల రమణ, జనసేన నాయకులు కోలా సోమశేఖర్, చిన్నరాయల్, చైతన్యరాయల్, నరేశ్‌రాయల్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందేలా సేవలందించాలి



నేతలను సన్మానించిన విశ్వనాథ్ తదితరులు

రామకుప్పం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రెస్కో, ఏఎంసీ పాలకవర్గాల్లో చోటు పొందిన వారు ప్రజలకు మెరుగైన సేవలందించి వారి మన్ననలు పొందాలని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి కోరారు. రెస్కో వైస్‌చైర్మన్‌గా నియమితులైన తెలుగు యువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, రెస్కో, ఏఎంసీ డైరెక్టర్లుగా నియమితులైన సతీష్, మునీంద్రనాయక్, కొళ్లపల్లె విజయ్‌కుమార్ ఆదివారం నారాయణాచారి, ఆంజనేయరెడ్డిలను కలిసి తమ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, ఆత్మ మాజీ డైరెక్టరు రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



సుబ్రహ్మణ్యస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పుంగనూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక సందర్భంగా పుంగనూరు నగిరిప్యాలెస్ సమీపంలో వెలసిన సోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం అత్యంత వైభవంగా అర్చకులు సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా ఊరేగింపు



సదుం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక గార్గేయ నదిపై వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవంలో భాగం గా ఆదివారం రాత్రి స్వామి వారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, స్వామి వారికి విశేష అలంకరణ, అన్నదానం చేశారు. రాత్రి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుష్పపల్లకిపై విద్యుత్ అలంకరణతో మంగళవాయిద్యాలు, బళ్లారి డ్రమ్ములు, చెక్కభజనలు, కోలాటాల నడుమ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. స్వామి వారికి ఇంటింటా పూజలు చేశారు. సోమవారం స్వామి వారి ధ్వజారోహణం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్.. బడుగుల బతుకులకు ఆసరా



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీతో బడుగుల బతుకులకు ఆసరా లభిస్తుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం మండల, మున్సిపల్ టీడీపీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, రాజ్ కుమార్ అన్నారు. కుప్పం మండలం, మున్సిపాలిటీలకు సంబంధించిన బాధిత కుటుంబాలకు రూ.40 లక్షలు విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. కుప్పం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాయంలో జరిగిన పంపిణీ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, వైస్ చైర్మన్ విశ్వనాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యంద్రశేఖర్, నాయకులు చంద్ర, జని, ఉదయ్, హేమాంబర గౌడ్, రాజగోపాల్, వెంకటేశ్, బాలాజీ, మహేంద్ర, మురళీ పాల్గొన్నారు.

ఇంటింటా కరపత్రాల పంపిణీ

పుంగనూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రైతు ప్రభుత్వం అని ప్రచారం చేస్తున్న కూటమి ప్రభుత్వం రైతు కష్టాలను పట్టించుకోలేదని చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ఆరోపించారు. చంద్రబాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పుంగనూరు ఎన్ఎస్‌పేట, రాంనగర్ కాలనీలో టీడీపీపై ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచి బీఎస్పీ బలోపేతం

పుంగనూరు రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి నుంచి బీఎస్పీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ ప్రగతి భవన్‌లో నియోజకవర్గ బీఎస్పీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినపుడే ప్రజలు మన పక్షాన నిలబడుతారన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సురేంద్రబాబు, బాబు, సుమిత్ర రమణ, న్యాయవాది శ్రీనివాసులు, అంజప్ప, మహనంది, బాలసుబ్రహ్మణ్యం, శంకర్, సదుం హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా ఉద్యాన మొక్కలు

రామకుప్పం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం, శాంతిపురం మండలాల్లోని పేదరైతులకు కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్‌కు చెందిన ప్రకృతి సేవా సంస్థ బెంగళూరు ఇన్ఫోసిస్ కంపెనీ ఆర్థిక సహకారంతో మామిడి, సపోటా మొక్కలు అందిస్తోందని సంస్థ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ ప్రశాంత్ ఆదివారం తెలిపారు. అలాగే వాటి పెంపకం కోసం ఎరువులు, గట్లలో నాటేందుకు కొబ్బరి, ఎర్రచందనం, పెద్దపనస, పెద్దవేప, మహాగని మొక్కలు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నంబర్లు 9703998947, 9948169389, 8886162161 లను సంప్రదించాలని ఆయన కోరారు.

పెద్దఉప్పరపల్లెలో ఘనంగా పశువుల పండుగ

సోమల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పెద్దఉప్పరపల్లె గోకులవీధిలోని శ్రీకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పశువుల పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. ఈక్రమంలోనే గోశాలలో పశువులను సుందరంగా అలంకరించి గోపూజలు చేశారు. అనంతరం పసలమందలో పశువులను ప్రదక్షిణలు చేయించి పరుగు పందాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే చిన్నఉప్పరపల్లె పంచాయతీ నవరంవారిపల్లెలో యాదవ సంఘసభ్యులచే పలు రకాల పోటీలు, ఉట్లోత్సవం నిర్వహించి బహుమతులు అందజేశారు. గ్రామవీధుల్లో శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తి ఊరేగించారు.

పాత కక్షలతో దాడి

సోమల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంటకు చెందిన మధుసూదన్ నాయుడుపై బంగ్లాకు చెందిన రెడ్డెప్పనాయుడు పాత కక్షలతో దాడి చేయడంతో కేసునమోదు చేసినట్లు ఎస్ఐ శివశంకర తెలిపారు. ఇరికిపెంటకు చెందిన మధుసూదన్‌నాయుడు సదుంలో హోటల్ నడుపుతున్నాడు. శనివారం రాత్రి ఆడికృత్తిక సందర్భంగా స్వగ్రామానికి వచ్చి తిరిగి సదుంకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా మార్గ మధ్యంలో ఇరికిపెంట పంచాయతీ బంగ్లాకు చెందిన రెడ్డెప్పనాయుడు అతనిపై దాడి చేసి కొట్టాడు. బాధితుని ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. .

భూవివాదంపై ఇరువర్గాలపై కేసు నమోదు

సోమల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం వల్లిగట్ల పంచాయతీ ముడివారిపల్లెకు చెందిన ఇరువర్గాల వారు భూవివాదంపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివశంకర తెలిపారు. ముడివారిపల్లెకు చెందిన శ్రీనివాసులు, మునిరత్నం మధ్య గత కొన్నేళ్లుగా భూసమస్యలు ఉన్నాయి. ఈక్రమంలోనే పొలం వద్ద వివాదం జరిగింది. ఇరువర్గాల వారు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



నాగరాజు దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆరోగ్యసంరక్షణపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు అన్నారు. మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత మెగా వైద్యశిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ముందస్తు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న మహతి చైర్మన్ నాగరాజు, అమృత దంపతులను వైద్యసిబ్బంది, స్థానికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ ప్రతినిధులు తిమ్మక్క, అమృత, కార్తికేయ, శాంతమ్మ, బుజ్జి, నాని, శ్రీనివాసులు, డాక్టర్ యగంధర్, కుప్పం పీఈఎస్ ఆస్పత్రి పీఆర్వోలు వెంకటేష్, చంద్ర, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వి.కోటలో ట్రాఫిక్ జఠిలం

● పార్కింగ్ స్థలాలు లేక వాహనదారుల అవస్థలు ● మూడు కూడళ్లలో గంటల కొద్దీ రద్దీ
● పాఠశాల, కళాశాలల వేళల్లో మరింత గందరగోళం ● ట్రాఫిక్‌ను పట్టించుకోని పోలీసులు





వి.కోట కేజీఎఫ్ బస్టాండులో ట్రాఫిక్, దుకాణాల ఎదుట ద్విచక్రవాహనాలు పెట్టడంతో స్తంభించిన రాకపోకలు

వి.కోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మూడు రాష్ట్రాల కూడలి ప్రాంతమైన వి.కోటలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది. ఇటీవల చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే వి.కోట మీదుగా అందుబాటులోకి రావడంతో అటు కర్ణాటక, ఇటు తమిళనాడు ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే వాహనాల రాకపోకల రెట్టింపుతో అధికమైంది. నిత్యం పట్టణంలో భారీ వాహనాలు రావడంతో వి.కోట పట్టణం రద్దీగా మారుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాల రాకపోకలతో పాటు వెలువడే కాలుష్యం ఎక్కువ కావడంతో పట్టణ ప్రజలు ఇబ్బదులు పడుతున్నారు. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ ట్రాఫిక్ స్తంభించిపోతూ కొన్ని సందర్భాల్లో గంటల కొద్దీ సమయం పడుతుండటంతో వి.కోటకి వచ్చేందుకే వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా కుప్పం, కేజీఎఫ్‌లకు వెళ్లే కూడలి (వైఎస్ఆర్ సర్కిల్), అలాగే పలమనేరు, వేలూరుకు వెళ్లే కూడలి (అంబేడ్కర్ సర్కిల్)లో వాహనాలు అటు, ఇటు వెళ్లేందుకు సరైన ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులో లేకపోవడంతో గంటల తరబడి ఈ రెండు చోట్ల గందరగోళం నెలకొంటోంది. అలాగే పట్టణంలో రోడ్డు వెడల్పు తక్కువగా ఉన్న చోట దుకాణాల ఎదుట ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఆపేస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దిగువనున్న కేజీఎఫ్ బస్టాండు వద్ద బస్సులు రోడ్డుపైనే ఆపేస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. బస్టాండు పరిసరాలల్లో తోపుడు బండ్లు రోడ్డుపైనే పెట్టేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాలల సమయాల్లో విద్యార్థుల రాకపోకల సందర్భంగా ఎన్టీఆర్ కూడలి వద్ద బాలుర పాఠశాలకు పిల్లలు వచ్చేపుడు రోడ్డు దాటేందుకు అవస్థలు పడుతున్నారు. అలాగే ప్రైవేటు స్కూళ్లు, కళాశాల ఉన్న చౌడేపల్లె రోడ్డు వైపు వెళ్లేందుకు సాయంత్రం విద్యార్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో సమస్య మరింత ఇబ్బందికరంగా మారింది. ప్రధాన కూడళ్లలో ఎలాంటి ట్రాఫిక్ సిగ్నల్స్ పట్టణంలో అందుబాటులో లేవు ఇకనైనా పాలకులు, అధికారులు వి.కోటలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పట్టణంలో ట్రాఫిక్ స్తంభించడంతో నిలిచిపోయిన కార్లు



ఎగువ చెక్‌పోస్టులో గందరగోళంగా వాహనాల రాకపోకలు

వేతన సవరణకు తక్షణ చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్

పలమనేరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలు, జీవన ప్రమాణాలకు అనుగుణంగా వేతన సవరణ చేపట్టేలా తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆదివారం పలమనేరులో కుబేరనాయుడు అధ్యక్షతన జరిగిన పలమనేరు డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదివరకే ఏర్పాటైన పీఆర్‌సీ కమిటీ చైర్మన్ రాజీనామా చేసి ఏడాదిన్నర కావస్తున్నా కొత్త చైర్మన్‌ను నియమించక పోవడం సరికాదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు విరుద్ధంగా నాలుగు డీఏలు బకాయిలుగా ఉండటం అన్యాయమన్నారు. బోధనేతర పనుల ఒత్తిడితో టీచర్లు, విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్‌యాదవ్ ఎస్‌టీయూ రాష్ట్ర నాయకులు పురుషోత్తమనాయుడు, డివిజన్ నాయకులు రవి, లక్ష్మీనారాయణ, భాస్కర్, చంద్రశేఖర్, గంగవరం ఎస్‌టీయూ ప్రధానకార్యదర్శి బాలకృష్ణ, చంగ్రాయులు, విజయకుమార్, రవి, వెంకటరామయ్య, వెంకటరమణ, చంద్రశేఖర్‌నాయుడు, చంద్రశేఖర్, ఏసురత్నం, దామోదరం, రమారాణి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొట్లపల్లె వద్ద మొక్కలు నాటుతున్న టీడీపీ నేతలు

వి.కోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలను విరివిగా నాటాలని మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మొట్లపల్లెలో శివాలయం భూముల్లో గ్రామస్తులతో కలిసి పలు రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, ఆలయ ధర్మకర్త నాగభూషణం, టీడీపీ నేతలు రాంబాబు, ఈశ్వర్, ధీరజ్, సోమశేఖర్, రామ్మూర్తిఆచారి, పంచాయతీ పార్టీ అధ్యక్షులు శ్రీరాములురెడ్డి, మునస్వామిరెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దబాలశిక్ష పుస్తకాల ఆవిష్కరణ



పెద్దబాలశిక్ష పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహిత్య సమితి సభ్యులు

గంగవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ముద్రించిన పెద్దబాలశిక్ష పుస్తకాలను ఆదివారం స్థానిక కళామందిరంలో తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి కార్యదర్శి పుష్ప, సమితి సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్దబాలశిక్షలో ముద్రించిన తెలుగు అంశాలను రోజూ గంటపాటు విద్యార్థులు చదివితే సర్వతోముఖాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు, పలమనేరు బాలాజీ, మాధవరెడ్డి, సీతారామయ్య, కన్నయ్య నాయుడు, దామోదర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు విరాళాలు



విరాళం అందజేస్తున్న దాతలు

సోమల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో ఆయన విగ్రహ ప్రతిష్ఠకు పలువురు దాతలు విరాళాలు అందజేసినట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. మునివెంకటప్ప, ఎస్వీ రమణ తెలిపారు. ఆదివారం సోమలలో జరిగిన కమిటీ సమావేశంలో పొదలకుంటపల్లెకి చెందిన సుంకర మునిరత్నం, భారతమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు సుంకర ప్రకాశ్, వందన దంపతులు, సుంకర ప్రవీణ్‌కుమార్, శ్వేత దంపతులు రూ.1,05,116 విరాళం అందజేశారు. కొండిశెట్టి రమేశ్‌బాబు, భారతీ దంపతులు (విద్యుత్ శాఖ) రూ. 20,116, పాయల చంద్రశేఖర్, కళావతి దంపతులు రూ.20, 116, పీలేరుకు చెందిన విశ్రాంత టీచర్ లక్ష్మయ్య రూ. 10,116, పెద్దఉప్పరపల్లెకు చెందిన రఘు రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి జ్యోతీశ్వరుడు, సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్, కామిశెట్టి నగేశ్, మహేంద్రబాబు, సాంబశివయ్య, పరికిదొన రమేశ్‌బాబు, బాబురావ్, టీచర్ రెడ్డెప్ప, కపిల సుబ్రహ్మణ్యం, మనోహర్ పాల్గొన్నారు.

బంగారు తిరుత్తణిలో వసంతోత్సవం



వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సోమల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సోమల బంగారు తిరుత్తణి కొండపై ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనేపథ్యంలోనే ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి మూలవిరాట్‌కు విశేష అలంకరణ చేసి అభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మేల్నాటి రఘుపతి పద్మావతమ్మ, పూల మురళీకృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కుక్కల బెడద



పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో కుక్కలు

పలమనేరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. దీంతో రోగు లు భయపడుతున్నారు. ఆస్పత్రి ఆవరణలో వీధి కుక్కల సంచారాన్ని అరికట్టేందుకు ఆస్పత్రి, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

ముత్తుకూరులో ముక్కు మూసుకోవాల్సిందే..!



బురదమయంగా ఉన్న ముత్తుకూరులోని వీధి

పెద్దపంజాణి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ముత్తుకూరు గ్రామంలో సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో మురుగునీరు వీధుల్లోకి వస్తున్నాయి. ఇటీవల తరచూ వర్షాలు పడుతుండటంతో మురుగు నీటితో పాటు వర్షపునీరు రోడ్లపై చేరుతోంది. దీంతో గ్రామంలోకి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడంతో అరకొరగా ఉన్న కాలువలు సైతం మూసుకుపోయాయని స్థానికులు వాపోతున్నారు. ఇళ్ల నుంచి బయట రావాలన్నా, బయట నుంచి గ్రామంలోకి వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'స్త్రీ శక్తి' పథకం గ్రాండ్ సక్సెస్

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్


మీడియాతో మాట్లాడుతున్న సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'స్త్రీ శక్తి' పథకం గ్రాండ్ సక్సెస్ అయిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో ముఖ్యమైన స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం మహిళా సాధికారతకు ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ప్రభుత్వం రాష్ట్రంలోని 74 శాతం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించిందని అన్నారు. రాష్ట్రంలోని 2.62 కోట్ల మంది మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కలుగుతుందని, మహిళలతో పాటు బాలికలకు, ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ సదుపాయం కల్పించారని తెలిపారు. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం నెలకు రూ.162 కోట్లు, ఏడాదికి రూ.1942 కోట్లు వ్యయం చేయనుందని చెప్పారు. గడచిన 30 గంటల్లో ఆర్టీసీ బస్సుల్లో 12 లక్షల మందికి పైగా మహిళలు ఉచితంగా ప్రయాణించారని అన్నారు. మహిళా ప్రయాణికుల విజ్ఞప్తుల మేరకు ఘాట్ రూట్‌లలోనూ ఉచిత ప్రయాణానికి సీఎం చంద్రబాబు అనుమతిచ్చారని చెప్పారు. కాగా మహిళల నుంచి ప్రభుత్వానికి వస్తున్న విశేష ఆదరణను చూసి ఓర్వలేక వైసీపీ నేతలు విమర్శించడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు మోహన్‌రాజ్, యువరాజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ భూములను ధారాదత్తం చేస్తే ఒప్పుకోం


మీడియాతో మాట్లాడుతున్న ఈయూ నాయకులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో కోట్లు విలువచేసే ఆర్టీసీ స్థలాన్ని లులూ షాపింగ్‌మాల్‌కు ఇవ్వడాన్ని ఒప్పుకోమని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని ఈయూ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ విజయవాడ నగరంలోని ఆర్టీసీ పాతబస్టాండ్‌కు సంబంధించి సుమారు రూ.400 కోట్ల విలువచేసే 4.15 ఎకరాల స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు దారాదత్తం చేయడానికి ప్రభుత్వం జీవోను విడుదల చేసిందన్నారు. దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో ఇలా చేయడం సరికాదన్నారు. ఆ స్థలం ప్రైవేటు చేతికి వెళ్తే ప్రయాణికులు ఇబ్బందిపడతారని అన్నారు. 2014లో కూడా టీడీపీ ప్రభుత్వం విజయవాడలోని ఆర్టీసీ ట్రైనింగ్ కళాశాలకు చెందిన 29 ఎకరాలను హెచ్‌ఈఎల్ కంపెనీకి కట్టబెట్టిందన్నారు. ఇందుకు బదులుగా ఆర్టీసీకి ఇస్తామని చెప్పిన భూమిని ఇంత వరకు ఇవ్వలేదని గుర్తుచేశారు. ఈ సమావేశంలో ఈయూ నాయకులు మణి, పార్థిబన్, మధు, హరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్యామిలీ డే వేడుకలు


ఫ్యామిలి డే వేడుకల్లో పాల్గొన్న యోగా గురువు నరేంద్ర కుమార్ తదితరులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సంతపేట పీఎన్‌సీ నగరపాలక ఉన్నత పాఠశాలలో ఆదివారం సిద్ధి సమాధి యోగా వ్యవస్థాపకులు ఋషి ప్రభాకర్ జయంతిని ఫ్యామిలీ డే వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సిద్ధి సమాధి యోగా శాఖ గురువు నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఋషి ప్రభాకర్ ఆశయాలను ప్రతి ఎస్ఎస్‌వై కార్యకర్త ఆచరించి సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తూ ఇతరుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఋషి ప్రభాకర్ చిత్రపటానికి పూజలు చేశారు. ఉత్తమ సేవలు అందించిన సిద్ధి సమాధి యోగా వాలంటీర్లను ఆయన ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేశవన్, కిరణ్, దుర్గా క్రిష్ణ, జ్ఞాన శేఖర్, దేవి, దేవకి, మురుగేష్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్లకు సత్కారం


సత్కారం అందుకున్న ప్రభుత్వ డ్రైవర్ల సంఘ నాయకులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వాహన చోదకులను ఆదివారం పాత కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఇటీవల జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ డ్రైవర్లుగా ప్రశంసా పత్రాలు పొందిన అటవీశాఖ డ్రైవర్ మురాద్ బాషా, కలెక్టరేట్ డ్రైవర్లు ప్రకాష్, రూప్‌కుమార్‌లతో పాటు ఇటీవల గృహ నిర్మాణ శాఖలో డ్రైవర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన జయరాంలను ఘనంగా సత్కరించి, మెమెంటోలు అందజేశారు. ఏపీ డ్రైవర్స్ అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షులు పన్నీర్ సెల్వం, జిల్లా ప్రభుత్వ డ్రైవర్లు హరిబాబు, షణ్ముగం, సి.బాబు, రవికుమార్, వినాయక, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంతాన వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక పూజలు


కలశాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలం తిరువీధి కుప్పం గ్రామంలో గల సంతాన వేణుగోపాల స్వామి ఆలయ 12వ వార్షికోత్సవ పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారి విగ్రహాలకు అభిషేకం, ప్రత్యేక అర్చన పూజలు చేశారు. కుంభాభిషేకం పూజలో భాగంగా ఆలయం ముందు హోమం, కలశ పూజలను అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ వేడుకగా నిర్వహించారు. గర్భగుడి కలశాలపై పూజల్లో పెట్టిన కలశాల నీటిని పోసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకీలో అధిష్ఠింపజేసి గ్రామవీధుల్లో ఊరేగించగా, మహిళలు కర్పూరహారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పూతలపట్టు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిడారిమిట్ట దళితవాడలో శనివారం రాత్రి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారి ఉత్సవ విగ్రహానికి పలురకాల అభిషేకాలతో పాటు శాంతి హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని పుష్పపల్లకీలో ఊరేగించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకేబాబు సతీమణి సీకే లావణ్య, స్థానిక టీడీపీ నేతలు బుల్లెట్ నరేష్ రెడ్డి, సురేష్, గోపి, వంశీతో పాటు బిడారిమిట్ట గ్రామానికి చెందిన యువకులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రవంకపై చెల్లియమ్మ విహారం


విశేష అలంకరణలో చెల్లియమ్మ

నగరి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కరకంతాపురం గ్రామంలో ఆడినెల ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామదేవత చెల్లియమ్మను ధనలక్ష్మి రూపంలో అలంకరించి మల్లెపూలతో సిద్ధం చేసిన చంద్రవంకపై ఉంచారు. చంద్రవంకను భక్తులు అందంగా అలంకరించారు. గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా, నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో కనికలమ్మకు పూజలు


పూజల్లో పాల్గొన్న చెన్నకేశవులు నాయుడు, బాలాజీ నాయుడు

గుడిపాల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మసముద్రం క్రాస్ సమీపంలోని కనికలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలను గ్రామస్తులు నిర్వహించారు. అమ్మవారికి మరకాలకుప్పం, డీకేపల్లె, చింతగుంటూరు, తిమ్మాపల్లె, నాగేంద్రపురం తదితర గ్రామస్తులు తమ మొక్కుబడులు తీర్చుకుని, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవుల నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, మాజీ ఎంపీపీ నాగరాజ్ యాదవ్,మాజీ సర్పంచ్ మార్కొండ మందడి, గ్రామ పెద్దలు, నిర్వాకులు పాల్గొన్నారు.

నగరంలో చిరుజల్లులు


ఎంఎస్ఆర్ సర్కిల్‌లో వర్షంలో తడుచుకుంటూ ప్రయాణం చేస్తున్న వాహనదారులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం సాయంత్రం చిరు జల్లులతో వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ బురదమయం అయ్యాయి. వాహనదారులు. ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. పొన్నియమ్మ గుడి, బజారు, చర్చివీధుల్లో చిరు వ్యాపారులు లకు వ్యాపారం జరుగలేదు. ఈ వర్షాలు మరో రెండు రోజులపాటు కొన సాగనున్నాయి.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నేతలు

చిత్తూరు సిటీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే, చిత్తూరు ప్రెస్‌క్లబ్ సంయుక్తంగా స్థానిక తపోవనంలోని వృద్ధులకు బ్రెడ్లు, పండ్లు పంచిపెట్టారు. అనంతరం గంగనపల్లెలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లోకనాథన్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, నేతలు మురళీకృష్ణ, కాశేశ్వర్‌రెడ్డి, అశోక్‌కుమార్, శివకుమార్, పవన్‌కుమార్, శివ, రామకృష్ణ, చంద్ర, రాజేష్, చంద్రశేఖర్, చంద్రప్రకాష్, కృష్ణసింగ్, శ్రీనివాసులు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం


తగలబడుతున్న గడ్డివాములు

పాలసముద్రం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకండ్రిగ గ్రామంలో శనివారం రాత్రి వెంకటేశులు నాయుడికి చెందిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. కృష్ణాష్టమి సందర్భంగా గ్రామంలో కృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగించారు. భారీ ఎత్తున టపాకాయలు పేల్చడంతో నిప్పురవ్వలు గడ్డివాములపై పడ్డాయి. ఊరేగింపు ముగిసిన అనంతరం గడ్డివాములు నెమ్మదిగా రగులుకుని భారీ మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో గ్రామస్తులు చిత్తూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ ఫైర్ ఇంజన్లు వచ్చే సమయానికి రెండు గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. దీంతో రైతుకు రూ.50 వేల నష్టం వాటిల్లింది. వర్షాకాలం పశువులకు నిల్వ చేసిన వరిగడ్డి కాలి పోవడంతో ఆ రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తుంది.

మంత్రి దృష్టికి విద్యాశాఖ సమస్యలు: ఆపస్

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను శనివారం రాత్రి కలిసి విద్యారంగంలోని సమస్యలు వివరించినట్లు ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం, ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు, అన్ని కేడర్‌లో పదోన్నతులు, 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు, ఐఆర్, డీఏల ప్రకటన, ఆర్థిక బకాయిల చెల్లింపు, తెలుగు మీడియం, హైస్కూల్ ప్లస్‌లు కొనసాగింపు తదితర వాటిని వివరించినట్లు తెలిపారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నుంజర్ల ప్రాజెక్టుకు జలకళ

● కాలువల నిర్వహణ లోపంతో వినియోగించుకోలేని దుస్థితి
● మరమ్మతుల కోసం రైతుల ఎదురుచూపులు


పూర్తిస్థాయిలో నిండిన నుంజర్ల ప్రాజెక్టు

యాదమరి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూమిరెడ్డిపల్లి నుంజర్ల ప్రాజెక్టులో పూర్తి సామర్థ్యంతో నీటి నిల్వలు ఉన్నప్పటికీ రైతులు తమ పంటలకు నీరందించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువల్లో మరమ్మతు పనులకోసం ఏళ్లుగా ఎదురుచూపులు తప్పడంలేదు. ఈ ప్రాజెక్టులో ఏడాది పొడవునా నీరు ఉన్నప్పటికీ మొరవ ద్వారా వృథాగా నీవానదిలో కలుస్తుంది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 15.65 ఎంసీఎఫ్‌టీ కాగా గత పదేళ్ళుగా పూర్తిస్థాయిలో నీరు ఉన్నప్పటికీ, సాగుకు అవసరమైన నీరు సరఫరా చేసే కాలువలకు గండ్లుపడి శిథిలావస్థకు చేరాయి. కుడి, ఎడమ కాలువల ద్వారా 779 ఎకరాల ఆయకట్టుకు నీరందించే సౌకర్యం ఉన్నా సాధ్యపడడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రాజెక్టు కింద భూమిరెడ్డిపల్లి, దళవాయిపల్లి, ముద్దురామాపురం, లగడపాటూరు,


రాళ్లు, చెట్లు, మట్టితో మూసుకుపోయిన ఎడమకాలువ, దయనీయంగా ఆయకట్టు కాల్వ

కాశిరాల, మార్లబండ తదితర గ్రామాల పరిధిలో ఉన్న 779 ఎకరాల ఆయకట్టులో వరి, వేరుశనగ వంటి పంటలు సాగుచేసేందుకు రైతులు ఎదురుచూస్తున్నారు. కానీ నీరు లేకపోవడం వల్ల తమ పెట్టుబడులు వృథా అవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి



ఎమ్మెల్యే మురళీమోహన్ సార్.. కాలువల మరమ్మతులు, ఆధునికీకరణకు తక్షణమే అవసరమైన నిధులు కేటాయించి, పంటలను కాపాడాలి. ఈ సమస్యపై ప్రభుత్వ అధికారులు వెంటనే దృష్టి సారించి పరిష్కారం చూపాలి. నుంజర్ల ప్రాజెక్టు నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటే రైతులకు లబ్ధి చేకూరుతుంది.

- లక్ష్మీపతి నాయుడు, నుంజర్ల ప్రాజెక్టు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు, భూమిరెడ్డిపల్లి పంచాయతీ

కాలువల ఆధునికీకరణకు ప్రతిపాదనలు

కాలువలు పూర్తిగా చెట్లు, మట్టి పూడికలతో మూసుకుపోయాయి. గతంలో రూ.1.50 కోట్ల నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం.

- వేణు, ఇరిగేషన్‌శాఖ ఏఈ

వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు

● ఇబ్బంది పడుతున్న విద్యార్థులు


ఆముదాలలో వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు

పాలసముద్రం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆముదాల జడ్పీహైస్కూల్‌కు వెళ్లే రహదారిలో ఉన్న కల్వర్టు గత సంవత్సరం నవంబరు నెలలో కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి అధికారులు ఈ కల్వర్టును తొలగించి కొత్తది నిర్మించకపోవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి దూరంగా కొండప్రాంతానికి సమీపంలో నిర్మించిన పాఠశాలకు వెళ్లాలంటే కోడవాగు దాటుకుని వెళ్లాలి. విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలను నిర్మించిన సమయంలోనే వాగుపై కల్వర్టు నిర్మించారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు వాగు ప్రవాహం దాటికి కల్వర్టు కొట్టుకుపోయింది. ప్రస్తుతం విద్యార్థులు దెబ్బతిన్న కల్వర్టుపై నుంచి పాఠశాలకు వెళుతుండటంతో ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థుల సౌకర్యార్థం కల్వర్టును నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కమనీయంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం


వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవ సందర్భంగా సారె తీసుకుంటున్న ఈవో కృష్ణనాయక్, పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

వెదురుకుప్పం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం కుమారగిరి కొండపై వెలసి ఉన్న వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్కంధ పుష్కరిణి వద్ద స్వామి అమ్మవార్లకు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. కల్యాణోత్సవం ఉభయకర్తలు కావేరి, పురుషోత్తం మొదలియార్, కె.జయలక్ష్మి, దొరస్వామిరెడ్డి, కె.నీరజ, గోపాల్ నాయుడు కుటుంబీకులతో అన్నదానం చేశారు. కార్వేటినగరం చాకలివానిగుంట ఎస్టీ కాలనీ వాసులు ఆనవాయితీ ప్రకారం ఊరేగింపుగా 'సారె'ను తీసుకువచ్చి స్వామికి సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం రాత్రి అమ్మవార్లతో సహా సుబ్రహ్మణేశ్వరస్వామి తెప్పై అధిష్ఠించి స్కంధ పుష్కరిణిలో ఐదు చుట్లు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాల్లో ఈవో కృష్ణనాయక్, సీఎఫ్‌వో సుబ్రహ్మణ్యం నాయుడు, మేళం రవియాదవ్, ఎంపీపీ లత, రాజశేఖర్, సాయిరాయల్, లీలాకృష్ణ, లక్ష్మీపతి, ధనంజయులు, రవిరెడ్డి, గౌతంరాజు తదితరులు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం హుండీ లెక్కించగా, రూ.3,77,262 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ మొత్తాన్ని ఖజానాలో జమ చేస్తామని చెప్పారు.

ఏఎంసీ డైరెక్టర్లుగా గంగాధరనెల్లూరు నుంచి ఆరుగురి ఎంపిక


కామసాని కోదండరెడ్డి, ఎస్.హెచ్. నియాజ్‌అలీ, నడింపల్లె దేవరాజులు, వి.గ్రీష్మ, దేరాంగల లోకమ్మ, లెక్కలపూడి అరుణ

గంగాధరనెల్లూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పెనుమూరు మార్కెట్ కమిటీలో ఇప్పటికే అధ్యక్షుడిగా పాతపాళ్యం పంచాయతీ మిట్టకొత్తూరుకు చెందిన ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, పాలసముద్రం మండలం ఆముదాల దళితవాడకు చెందిన అరుల్‌నాథన్ ఉపాధ్యక్షుడిగా ఎంపికైన విషయం తెలిసిందే. అదేవిధంగా గంగాధరనెల్లూరు మండలానికి చెందిన టీడీపీ తరపున ఐదుగురికి, బీజేపీ తరపున ఒకరికి డైరెక్టర్లుగా అవకాశం లభించింది. గంగాధరనెల్లూరు మండలంలోని ఎట్టేరి గ్రామానికి చెందిన కామసాని కోదండరెడ్డి, ఆవలకొండకు చెందిన ఎస్.హెచ్.నియాజ్‌అలీ, బాలగంగనపల్లెకు చెందిన నడింపల్లె దేవరాజు, పెద్దకాల్వ పంచాయతీ ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన డేరాంగుల లోకమ్మ, గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన వి.గ్రీష్మ, కె.వెంకటాపురం గ్రామానికి చెందిన లెక్కలపూడి అరుణలను పెనుమూరు మార్కెట్ కమిటీలో డైరెక్టర్లుగా ఎంపిక చేశారు.

తెలుగుదేశం పార్టీ శ్రేయస్సే లక్ష్యం


మూడో వార్డు దళిత యువతతో చలపతి, లత

నగరి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ శ్రేయస్సే మా జీవిత లక్ష్యమని నగరి పట్టణ మూడో వార్డుకు చెందిన దళిత యువత అన్నారు. సామాలమ్మ గుడి వద్ద ఆదివారం టీడీపీ నాయకులు చలపతి, లత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చలపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. యువత చంద్రన్న వెంట నడవడం ఆవశ్యమని తెలిపారు. సమావేశం చివరలో చంద్రబాబు వంటి ముఖ్యమంత్రికి అండగా ఉండటం మా ప్రధాన బాధ్యత.. తెలుగుదేశంపార్టీ శ్రేయస్సే మా జీవిత లక్ష్యమని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప, గంగాధరం, జానకీరామ్, పురుషోత్తం, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓరోరి దుర్యోధనా... నిన్ను వదలా...!


దుర్యోధనుడిని మడుగు నుంచి లాక్కొస్తున్న భీముడు

ఐరాల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఓరోరి దుర్యోధనా... నిన్ను వదలా అని భీముడి పాత్రధారి పద్యాలు పాడుతూ నటించే సన్నివేశం ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. మండలంలోని మద్దిపట్లపట్లపల్లెలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా చివరి రోజైన ఆదివారం ఉదయం దుర్యోధన వధ ఘట్టాన్ని వేషధారులు ప్రదర్శించారు. నిర్వాహకులు మట్టితో దుర్యోధనుడి బొమ్మను తీర్చిదిద్దారు. తమ అద్భుతమైన ప్రదర్శనతో వేషధారులు ఆహూతులను ఆకట్టుకున్నారు.

అలరించిన దుర్యోధన వధ

యాదమరి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశిరాల గ్రామంలో జరుగుతున్న మహాభారత యజ్ఞం ఆదివారం దుర్యోధన వధ ఘట్టంతో ముగిసింది. భీముడు, దుర్యోధన వేషధారులు పద్యాలతో వీక్షకులను అలరింపజేశారు.

వైభవంగా ద్రౌపదీదేవి ఊరేగింపు


విశేష అలంకరణలో ద్రౌపదీదేవి, అర్జునుడు

నింద్ర, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నింద్రలో వెలసి ఉన్న ధర్మరాజుల సమేత ద్రౌపదీదేవి ఆలయంలో ఆదివారం వైభవంగా పూజలు నిర్వహించారు. ఉదయం ద్రౌపదీదేవి, అర్జునుడి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో భారీగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

ఎమ్మెల్యే చొరవతో తీరిన దాహార్తి


బీరకుప్పంలో బోరు వేస్తున్న దృశ్యం

నగరి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలో తాగునీటి కొరత వున్న గ్రామాలను గుర్తించిన ఎమ్మెల్యే భానుప్రకాష్ జడ్పీ నిధులు మంజూరు చేయించి ప్రజల దాహార్తి తీర్చారు. నగరి మండలంలోని అయనంబాకం, కొత్తకండ్రిగ, బీరకుప్పం, ఎమ్ఎన్‌కండ్రిగలో బోర్లు వేయించడంతో తాగునీరు సమృద్ధిగా పడ్డాయని ఆయా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. మండల పరిధిలో 11 పనులకు గాను రూ.50.5 లక్షలు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ శ్రీహరి పేర్కొన్నారు.

దారి సమస్యను పరిష్కరించండి


కట్టకిందపల్లెలో దారికి అడ్డంగా వేసిన కంపలు

గుడిపాల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మా దారి సమస్యను పరిష్కరించండీ అంటూ కట్టకింద ఎస్సీకాలనీ వాసులు కోరుతున్నారు. కట్టకింద పల్లె నుంచి నరహరిపేటకు సంతకు వెళ్లే దారిలో కాలనీకి చెందిన ఓ వ్యక్తి ముళ్ల కంపలు వేసి అడ్డుకుంటున్నారని ఆదివారం కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇకనైనా దారిని సర్వే చేసి తమకు న్యాయం చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కోతకు గురైన ప్రశాంత్‌నగర్ రోడ్డు

● పొంచి ఉన్న ప్రమాదం



చిత్తూరు సిటీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సాక్షాత్తు జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఉన్న రోడ్డు ఇటీవల కురుస్తున్న వర్షాలకు తీవ్ర కోతకు గురైంది. ఎస్పీ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న ప్రశాంత్‌నగర్‌లో వేలాది మంది నివాసముంటున్నారు. ఇక్కడ నివసించే వారంతా దినసరి కూలీలు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి వారే. ప్రతిరోజూ ప్రశాంత్‌నగర్ నుంచి ఉదయం ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో చిత్తూరుకు వచ్చి పనులు ముగించుకుని రాత్రి ఇంటికి వెళుతుంటారు. ఈ ప్రాంతంలో ఉన్న మలుపు వద్ద రోడ్డు కోతకు గురి కావడంతో రాత్రి సమయాల్లో గమనించక తరచూ ప్రమాదాలు జరుగుతుండటంలో పలువురు గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.